సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం ၊ 28 ၊ ఆగస్టు ၊ 2024



టన్ను చీనీ రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23 వేలు పలికాయి. మార్కెట్‌కు 169 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.22

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.6, సరాసరిన రూ.15 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.6°/23.2°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం తర్వాత ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.



పటిష్ట భద్రత కల్పించాలి

“ కోల్‌కతా సంఘటన తర్వాత రాత్రి వేళల్లో విధులంటేనే వైద్య సిబ్బంది భయపడిపోతున్నారు. రాత్రి వేళల్లో విధి నిర్వహణలో ఉండే మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందికి పూర్తిస్థాయిలో భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచాలి. ఆస్పత్రి వద్ద పగలు, రాత్రి సమయంలో వాచ్‌మెన్ ఏర్పాటు చేయాలి. వైద్యులు, సిబ్బందిపై దాడులను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి.

– చౌడేశ్వరి, స్టాఫ్‌నర్సు, పేరూరు పీహెచ్‌సీ, రామగిరి మండలం

శిక్షలు కఠినంగా ఉండాలి

కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటన అత్యంత అమానుషం. ఇంతటి ఘోరానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించి మరొకరు ఇలాంటి ఘటనకు పాల్పడకుండా చూడాలి. రాష్ట్రంలోనూ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు, సిబ్బంది భద్రతకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. చట్టాలు రూపొందించి కఠినంగా అమలు చేయాలి. అప్పుడే స్వేచ్ఛగా సేవలందించే అవకాశం ఉంటుంది. ”

– తులసి, స్టాఫ్‌నర్సు, రామగిరి పీహెచ్‌సీ



న్యూస్‌రీల్

క్రీడా పోటీలు ప్రారంభం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: హాకీ మాంత్రికుడు, మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ‘శాప్’ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లోని 7 వేల మంది విద్యార్థులతో ‘ఫిట్ ఇండియా’ ప్రతిజ్ఞ చేయించినట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఉదయ్ కుమార్ తెలిపారు. రామగిరి క్రీడా వికాస కేంద్రంలో పీడీ కోటప్ప, అథ్లెటిక్ కోచ్ శబరిగిరి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఖోఖో, పరుగుపందెం, వాలీబాల్, లాంగ్ జంప్, షటిల్ పోటీలు నిర్వహించారు. మరో రెండు రోజులు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో క్రీడా పోటీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



సమావేశంలో కమిటీ సభ్యులతో చర్చిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి

ప్రశాంతి నిలయం: జిల్లాలో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మంజువాణి హెచ్చరించారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, లింగనిర్ధారణ చట్టంపై క్షేత్రస్థాయిలో వైద్య,ఆరోగ్య శాఖ సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో గర్భవతులుగా గుర్తించిన వారికి తప్పని సరిగా ధ్రువీకరణ కార్డు మంజూరు చేయాలన్నారు. ఆడపిల్ల ప్రాముఖ్యతను అందరికీ వివరించాలన్నారు. జిల్లాలో స్కాన్ సెంటర్లు నిర్వహిస్తున్న వైద్యులు లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే పీసీసీ ఎన్డీటీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు గర్భవతులకు క్రమం తప్పకుండా వైద్యసేవలు అందించాలన్నారు. సమావేశంలో జిల్లా స్థాయి కమిటీ సభ్యులు, డీఐఓ డాక్టర్ నాగేంద్ర నాయక్, డీపీఎంఓ డాక్టర్ కుళ్లాయప్ప నాయక్, జిల్లా ఆరోగ్య విద్య బోధకురాలు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వర్ష సూచన



బుక్కరాయసముద్రం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో రానున్న 5 రోజుల్లో చిరు జల్లుల నుంచి తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలోని ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పగటి ఉష్ణోగ్రతలు 32.0–35.0 రాత్రి ఉష్ణోగ్రతలు 23.0–23.8 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చుఅన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 68–78 శాతం, మధ్యాహ్నం 54–78 శాతంగా నమోదవుతాయన్నారు.

పీఠం.. ఫిరాయింపు రాజకీయం

30 వార్డులున్న హిందూపురంలో గత మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ ఆరు స్థానాలు మాత్రమే దక్కించుకుంది. ఒకచోట ఎంఐఎం, మరోచోట బీజేపీ ఉనికి చాటాయి. మిగిలిన 22 స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగించింది. ప్రజలు తీర్పుకు అనుగుణంగా పాలన చేసింది. కానీ ఇటీవల రాష్ట్రంలో ‘కూటమి’ సర్కార్ అధికారంలోకి రాగానే... ఆరు స్థానాలున్న టీడీపీ.. అధికారం కోసం దిగజారి ప్రవర్తిస్తోంది. 11 మంది ఇతర పార్టీల కౌన్సిలర్లకు టీడీపీ కండువాలు కప్పింది. చైర్‌పర్సన్‌తో రాజీనామా చేయించింది. టీడీపీకి చెందిన ఆరుగురిలో ఒకరిని చైర్మన్ చేసేందుకు సిద్ధమైంది. తాము వైఎస్సార్ సీపీకి ఓటేసి అధికారమిస్తే టీడీపీ పెత్తనం చేయడమేమిటి..? ఇదేనా ఓటు విలువ..ఇదేనా ప్రజాస్వామ్యం అని జనం ప్రశ్నిస్తున్నారు.



అధికారం కోసం దిగజారి..

- స్థానిక సంస్థల పీఠం కోసం టీడీపీ నీచ రాజకీయం
- ప్రత్యర్థి పార్టీ నేతలకు గాలం
- భయపెట్టి, బతిమాలి పార్టీ కండువా కప్పుతున్న వైనం
- ఫిరాయింపుదారులపై తిరుగుబాటుకు సిద్ధమైన ప్రజలు
- దమ్ముంటే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్
- డబ్బుకు ఆశపడి మోసం చేయడం సరికాదని హితవు

సాక్షి, పుట్టపర్తి

రాజకీయంగా బలం లేకపోయినా.. ఎన్నికల్లో గెలవకపోయినా.. అధికారం చెలాయించాలనే ఉద్దేశంతో అధికార పార్టీ నాయకులు దిగజారుడు రాజకీయం చేస్తున్నారు. లోపాయికారీ ఒప్పందాలకు తెరదీస్తూ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారు. అధికారమే పరమావధిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు.

కథలన్నీ కండువా కప్పేంత వరకే...

ప్రజాస్వామ్యంలో ఓటరుదే కీలక పాత్ర. ఎవరు అధికారంలో ఉండాలో నిర్ణయించేది ఓటరే. కానీ టీడీపీ అధినేత చంద్రబాబు మాత్రం ఓటుతో కాకుండా నోటుతో రాజకీయం చేస్తున్నారు. ఓటరు ఎవరిని ఎన్నుకున్నా... ఆ నేతకే నోటు ఇచ్చి పార్టీలో చేర్చుకుంటున్నారు. తన అవసరం మేరకు ఇప్పటికే ఎంతోమందిని ఇలా పార్టీలోకి చేర్చుకున్నారు. అయితే కండువా కప్పేంత వరకూ డబ్బు, పదవి ఆశ జూపుతూ కథలు చెప్పే బాబు...ఆ తర్వాత వారిని ‘కూరలో కరివేపాకు’లా తీసిపడేస్తారు. ఇలా ఎంతో మంది రాజకీయ భవిష్యత్‌ను నాశనం చేసేశారు. తాజాగా స్థానిక సంస్థల్లో పట్టు కోసం ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను తనవైపు తిప్పుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. ప్రజాక్షేత్రంలో గెలిచిన నాయకులకు గాలం వేస్తున్నారు. పచ్చ కండువా వేసుకుంటే పదవులు కట్టబెడుతామని ఆశచూపుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే కొందరిని పార్టీలో చేర్చుకున్నారు.

అక్కడ ఉండలేక.. ఇక్కడికి రాలేక

పార్టీ ఫిరాయించిన వారికి ఆదిలోనే కష్టాలు ఎదురయ్యాయి. పలు ఆఫర్లు ప్రకటించి కండువా వేసిన టీడీపీ నేతలు...ఆ తర్వాత తమను పట్టించుకోవడం లేదని సదరు నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ ఉండలేక.. వెనక్కి తిరిగి రాలేక దిక్కుతోని స్థితిలో ఉన్నారు. వెన్నుపోటుకు కేరాఫ్‌గా నిలిచిన టీడీపీ నాయకులు తమను ప్రలోభాలకు గురి చేసి పార్టీలోకి చేర్చుకుని.. మోసం చేశారని బంధువుల వద్ద వాపోతున్నట్లు సమాచారం.

జనాగ్రహానికి జడిసి కాలుబయట పెట్టని నేతలు

పార్టీ ఫిరాయించిన వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓటేసి గెలిపించిన జనం వారిని ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. ఎవరు...ఏ పార్టీలోనైనా చేరవచ్చని, కానీ ఒక పార్టీ సింబల్‌పై గెలిచి మరో పార్టీలో చేరడాన్ని సహించేది లేదంటున్నారు. దమ్ముంటే పదవికి రాజీనామా చేసి వెళ్లాలని ఓటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే పలుచోట్ల పార్టీ ఫిరాయింపు నేతల ఇళ్ల ముట్టడికి సిద్ధమవుతున్నారు. ఈ మేరకు కార్యాచరణ కూడా సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇన్నాళ్లు వెంట తిరిగిన కార్యకర్తలూ దూరమయ్యారు. పార్టీకి ద్రోహం చేసిన వారిని విడిచిపెట్టబోమని తెగేసి చెబుతున్నారు. దీంతో ఫిరాయింపు నేతలు ఎక్కడా కనిపించడం లేదు. ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు.

గతంలోనూ ఎమ్మెల్యేలకు టోకరా వేసిన చంద్రబాబు

చంద్రబాబు నాయుడు గతంలోనూ 23 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుని వారికి టోకరా వేశారు. అందులో ఒకరిద్దరికి మినహా మిగతా వారికి ఎన్నికల్లో టికెట్ కూడా ఇవ్వలేదు. వారిలో కొందరు వెనక్కి రాగా.. ఇంకొందరు అక్కడే ఉండిపోయారు. ఎమ్మెల్యేలుగా గెలిచి సీనియారిటీ ఉన్నా.. మంత్రి పదవి లేకుండా పోయింది. ప్రస్తుతం అదే తరహాలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకూ చుక్కెదురవుతోంది. నామినేటెడ్ పోస్టులు ఆశచూపి.. నిలువునా మోసం చేయడం ఖాయమని చెబుతున్నారు.

ఇటీవల పార్టీ ఫిరాయించిన కొందరు

- మడకశిర మున్సిపల్ వైస్ చైర్మన్‌తో పాటు మరో నలుగురు కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించారు. వీరందరికీ భారీగా డబ్బు ఆశ జూపినట్లు తెలుస్తోంది.
- హిందూపురం మున్సిపల్ చైర్ పర్సన్‌తో పాటు మరో 9 మంది కౌన్సిలర్లు పార్టీ మారారు. ఇందుకోసం టీడీపీ ఏకంగా రూ.కోటి ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది.
- కదిరి మున్సిపాలిటీలో ఆరుగురు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిని కూడా ప్రలోభాలకు గురి చేసినట్లు తెలుస్తోంది.

వేటు తప్పదు



పార్టీ ఫిరాయించిన వారి రాజకీయ భవిష్యత్తు అంధకారమే. అలాంటి వాళ్ల రాజకీయంగా ఎదిగినట్లు చరిత్రలో లేదు. ఒక పార్టీ సింబల్‌పై గెలిచి.. మరో పార్టీలో చేరడం నీచం. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి సంతలో పశువుల్లా ప్రజాప్రతినిధులను కొనడం టీడీపీకి అలవాటే. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల సమీకరణాల్లో భాగంగా సామాన్యులకు పదవులు కట్టబెడితే.. వారు నేడు డబ్బులకు అమ్ముడుపోయి.. దిగజారుడు తనాన్ని నిరూపించుకున్నారు. వైఎస్సార్ సీపీలో ఎవరు నిబంధనలు ఉల్లంఘించినా వేటు తప్పదు.

– నవీన్‌నిశ్చల్, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ

టీడీపీ నేతల బాహాబాహీ



ఘర్షణ పడుతున్న టీడీపీ శ్రేణులు

చిలమత్తూరు: కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ‘తెలుగు తమ్ముళ్ల’ మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. అంతా నేనంటే...కాదు నేనంటూ ద్వితీయ శ్రేణి నాయకులు బాహాబాహీకి దిగుతున్నారు. ముఖ్యంగా చిలమత్తూరు మండలంలో టీడీపీ నేతల మధ్య వర్గ పోరు తారస్థాయికి చేరింది. ఇప్పటికే రెండు వర్గాలుగా విడిపోయిన టీడీపీ నేతలు బహిరంగంగానే ఘర్షణకు దిగుతున్నారు. తాజాగా మంగళవారం చిలమత్తూరు పంచాయతీ టీడీపీ నేతలు రోడ్డుపైనే బాహాబాహీకి దిగారు. ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు రామప్పను పార్టీ నుంచి బహిష్కరించారు. పార్టీలోని కొందరు స్థానిక నేతలే తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకుని పార్టీ నుంచి పంపించారంటూ కొద్ది రోజులుగా రామప్ప పార్టీ నేతల వద్ద చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం టీడీపీ నాయకుడు అశ్వర్థప్ప, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నందీశప్ప కనిపించడంతో రామప్ప వారిని నిలదీశారు. తనను పార్టీ నుంచి ఎందుకు బహిష్కరించారంటూ ప్రశ్నించారు. దీంతో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. మాటామాటా పెరగడంతో ఒకరినొకరు దూషించుకున్నారు. ఇరువర్గాలకు చెందిన అనుచరులూ అక్కడికి చేరుకోవడంతో గొడవ కాస్తా పెద్దదయ్యింది. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి అక్కడకు చేరుకొని ఇరువర్గాలను సర్ది చెప్పే ప్రయత్నం చేసినా తొలుత వినిపించుకోలేదు. చివరకు మండల టీడీపీ నేతలు సర్దిచెప్పడంతో ఇరువర్గాలు శాంతించాయి.

కార్యకర్తను ఎత్తుకెళ్లిన టీడీపీ నేతలు

నేతల బాహాబాహీని సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న టీడీపీ కార్యకర్త గౌస్‌ను కొందరు టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. సెల్‌ఫోన్ లాక్కుని అతన్ని కారులో ఎత్తుకెళ్లారు. దీంతో ఈ ఘటన గురించి మరోవర్గం నేతలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కిడ్నాప్ కేసు పెడతామనడంతో చివరకు సదరు టీడీపీ కార్యకర్తను కారులో నుంచి దించేసినట్టుగా కార్యకర్త వాపోయాడు.

రెవెన్యూ సదస్సులకు పక్కా కార్యాచరణ

- సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయండి
- వీసీలో అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: సమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులకు పక్కా కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయప్రసాద్, డీపీఓ విజయ్‌కుమార్ తదితరులతో కలిసి కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ సదస్సులు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన, పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టే పనులు, ఉపాధి హామీ పనులపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఈఓఆర్డీలతో మాట్లాడి వారికి దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సులు ప్రజల వద్దకే పాలన తరహాలో నిర్వహించాలని సూచించారు. జేసీ ఇన్‌చార్జ్‌గా ఉంటారని, త్వరలోనే ఏ గ్రామంలో ఎప్పుడు సభ నిర్వహిస్తారో తెలియజేస్తారన్నారు. ఇక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారాన్ని ఎప్పటికప్పుడు డీఆర్‌ఓ సమీక్షిస్తారన్నారు. ఉపాధి పనుల కల్పనలోనూ జిల్లాను అగ్రగామిగా నిలపాలన్నారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద ధర్మవరం, ముదిగుబ్బ మండలాల్లో 5 వేల ఎకరాల్లో గుంతలు తీసే పనులు చేపట్టాలన్నారు. అమడగూరు, పుట్టపర్తి, నల్లమాడ, లేపాక్షి, చిలమత్తూరు తదితర మండలాల్లో అధిక సంఖ్యలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమం 1వ తేదీ ఆదివారం ఉదయం 5.30 గంటలకే ప్రారంభం కావాలన్నారు. 31వ తేదీ సాయంత్రం నాటికే బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకోవాలని సూచించారు.

పకడ్బందీగా ఈ–పంట నమోదు

ఈ–పంటలో నమోదు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ టీఎస్ చేతన్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ–పంట నమోదుకు సెప్టెంబర్ 15వ తేదీ వరకూ గడువు ఉందని, ఇప్పటి వరకూ జిల్లాలో 60 శాతం మాత్రం పూర్తయ్యిందన్నారు. గడువులోపు 100 శాతం పూర్తి చేయాలన్నారు. ఈ–పంట నమోదులో కౌలు దారులకూ చోటు కల్పించాలన్నారు. సాగు హక్కు పత్రాలు పొందిన రైతుల వివరాల నమోదుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని కలెక్టర్ తెలిపారు. దీనివల్ల ప్రకృతి విపత్తుల వల్ల పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం అందించే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకోసం రైతుసేవా కేంద్రానికి వెళ్లి సాగు చేసిన పంట వివరాలు, విస్తీర్ణం, సర్వే నంబర్, పట్టాదార్ పాస్ పుస్తకం నంబర్, ఆధార్ నంబర్ తదితర వివరాలను రైతులను తెలియజేయాలన్నారు. సెప్టెంబర్ 15వ తేదీలోపు సహకార సంఘాల కంప్యూటరీకరణ పూర్తి చేయాలన్నారు. సమీక్షలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, కోఆపరేటివ్ అధికారి కృష్ణానాయక్, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లూమ్స్‌పై ‘ఎన్‌ఫోర్స్‌మెంట్’ దాడులు

- పెద్దరాజు ఫ్యాక్టరీపై కేసు నమోదు



పవర్‌లూమ్స్ చీరలను తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ధర్మవరం: పట్టణంలోని ‘పవర్‌లూమ్స్’పై మంగళవారం హ్యాండ్లూమ్స్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ (ఆర్‌డీడీ) రాజారావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. కొత్తపేట, రామ్‌నగర్, పోతుకుంటల్లోని ఫ్యాక్టరీల్లో తనిఖీలు చేపట్టారు. చేనేత రిజర్వేషన్ చట్టం ప్రకారం 11 చేనేత రకాల చీరలను పవర్‌లూమ్స్‌లో తయారు చేయకూడదు. కానీ కొందరు పవర్‌లూమ్స్ నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రామ్‌నగర్‌కు చెందిన పెద్దరాజు ఫ్యాక్టరీలో ప్యూర్ టు ప్యూర్ చీరలు తయారు చేస్తుండటంతో అతనిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించినట్లు హ్యాండ్లూమ్స్ ఆర్‌డీడీ అధికారి రాజారావు తెలిపారు. ధర్మవరంలో హ్యాండ్‌లూమ్ ఏడీగా సుబ్రహ్మణ్యంను నియమించామని ఆయన వెల్లడించారు. ఇక ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల సమాచారంలో పట్టణంలోని పలువురు వ్యాపారులు దుకాణాలకు తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. తనిఖీల్లో చెన్నై రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ మనోహర్, టెక్నికల్ ఆఫీసర్ షణ్ముగం, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీ సుబ్రహ్మణ్యం, డెవలప్‌మెంట్ ఆఫీసర్ భాస్కర్, డిప్యూటీ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మీ పిల్లలనైతే ఇలాగే చూస్తారా..?

- గురుకుల పాఠశాల సిబ్బందిపై మంత్రి సవిత ఆగ్రహం



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి సవిత

లేపాక్షి: ‘‘మరుగుదొడ్లు ఇంత దారుణంగా ఉన్నాయి. కనీసం దుస్తులు ఆరబెట్టుకునేందుకు సరైన సౌకర్యాలు కల్పించలేదు. వసతి గృహంలో ఫ్యాన్లు కూడా లేవు. బియ్యం పురుగు పట్టి ఉన్నాయి. మీ పిల్లలనైతే ఇలాంటి పరిస్థితుల్లో ఉంచుతారా’’ అని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత గురుకుల పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె, లేపాక్షిలోని మహాత్మా జ్యోతిబా పూలే ఏపీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా మరుగుదొడ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో పాఠశాల సిబ్బంది, పారిశుధ్య కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా రోజులుగా శుభ్రం చేయకపోవడంతో పాచి పట్టి ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం వసతి గృహంలోని విద్యార్థుల గదులను పరిశీలించారు. గదుల్లో ఫ్యాన్లు లేకపోవడం, దుస్తులు ఆరబెట్టుకునేందుకు అవకాశం లేక చిన్నారులు ఎక్కడపడితే అక్కడ దుస్తులు ఆరవేసి ఉండటం చూసి మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. అసలు విధులు నిర్వర్తిస్తున్నారా..లేదా అని ప్రశ్నించారు. అసలు దీన్ని వసతి గృహం అంటారా అని మండిపడ్డారు. పద్ధతి మార్చుకోవాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని వసతి గృహం అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. వారం రోజుల్లో అన్నీ సరిచేయాలన్నారు. కొందరు విద్యార్థులు గవదబిళ్లలతో బాధపడుతుండటాన్ని గమనించిన మంత్రి నేరుగా వారి వద్దకు వెళ్లి పరామర్శించారు. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారా అని సిబ్బందిని ఆరా తీశారు. వంట గదిని, డైనింగ్ హాల్‌ను కూడా మంత్రి పరిశీలించారు. సరకులకు సంబంధించిన రికార్డుల గురించి మంత్రి ఆరా తీయగా... గత నెల నుంచి నమోదు చేయడం లేదని సిబ్బంది తెలపడంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి సవిత విద్యార్థులతో కాసేపు మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట ఏఎస్‌ఐ షర్ఫుద్దీన్, ప్రిన్సిపాల్ సుందరరాజు, వీఆర్‌ఓ రమేష్ ఉన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత ఖాద్రీశుడు

కమనీయం.. ఖాద్రీశుని ఊయలోత్సవం

కదిరి టౌన్: కృష్ణాష్టమి వేడుకలు ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం ఆలయం ఎదుట ఉన్న కృష్ణమందిరంలో అభిషేకాలు, ఆస్థాన పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వసంతవల్లభుడికి ఊయలోత్సవం నిర్వహించారు. కమనీయంగా సాగిన ఈ ఉత్సవానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. బుధవారం రాత్రి 8 గంటలకు ఆలయం ఎదుట ఉట్లోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.



స్వామివారికి ఊయలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కొత్త టెక్నాలజీని అలవర్చుకోవాలి : ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: దినచర్యలో భాగంగా నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పోలీసు సిబ్బందికి ఎస్పీ రత్న సూచించారు. జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్ల సర్కిల్ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న రైటర్లకు డిజిటల్ అప్లికేషన్, నూతన టెక్నాలజీపై మంగళవారం ఎస్పీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ... రోజు వారీ కార్యక్రమాలు, ఆఫీస్ వర్క్ డ్రాఫ్టింగ్, డిజిటల్ అప్లికేషన్ ఎలా భర్తీ చేయాలి, డీఆర్సీకి రోజూ సమాచారం ఎలా పంపాలి అనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, సీఐలు సతీష్, శ్రీనివాసులు, ఎస్పీ ఎస్‌ఐ ప్రదీప్, ఐటీ కోర్ ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దోషులకు వెంటనే శిక్షలు వేయాలి



వైద్యులపై దాడులు, అఘాయిత్యాలు, హత్యలకు పాల్పడే వారికి శిక్షలు వెనువెంటనే వేయాలి. అది కూడా కఠినంగా ఉండేలా చూడాలి. కోల్‌కతా ఘటన చాలా బాధాకరం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కఠిన చట్టాలు తేవడంతో పాటు కేసుల దర్యాప్తు, విచారణ పేరుతో కాలయాపన చేయకుండా నిందితులను కఠినంగా శిక్షించాలి.
– డాక్టర్ పావని, ధర్మవరం



రక్షణ కల్పించాలి

కోల్‌కతా ఘటనలో దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలతో పాటు రాత్రిళ్లు పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేస్తే మహిళా వైద్యులు, సిబ్బంది ధైర్యంగా విధులు నిర్వర్తించగలుగుతారు. రోగులతోపాటు పదుల సంఖ్యలో బంధువులు వచ్చి హడావుడి చేయడం, గొడవలు చేయడం, వైద్యులపై దాడులకు పాల్పడటం సరికాదు. రోగి వెంట ఒక అటెండర్ మాత్రమే ఉండేలా చూడాలి.
– డాక్టర్ జ్యోతి బిందు, ధర్మవరం



చెట్టు కిందే వంట..

- మోడల్ స్కూల్‌లో సమస్యల తిష్ట
- ఇంటి నుంచి క్యారియర్లతో స్కూల్‌కు
- మధ్యాహ్న భోజనం రుచిగా లేదంటున్న విద్యార్థులు
- తాగడానికి నీళ్లు లేక ఇబ్బంది

ఇంటి నుంచి క్యారియర్!


చింత చెట్టు కింద వంట చేస్తున్న నిర్వాహకులు


ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: మండలంలోని జగరాజుపల్లి మోడల్‌స్కూల్‌లో సమస్యలు తిష్ట వేశాయి. పరిష్కారానికి అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించడం, కలుషిత నీటిని తాగడం వల్ల విద్యార్థులు జబ్బు బారిన పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.

నాడు రుచికరంగా...

గ్రామీణ ప్రాంత విద్యార్థులు సైతం పోటీ ప్రపంచంలో రాణించేలా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి ఏపీ వ్యాప్తంగా ఏర్పాటైన ఏపీ మోడల్ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం చదువులను అందుబాటులోకి తీసుకువచ్చారు. అప్పటి నుంచి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ వచ్చిన మోడల్ స్కూళ్లకు వైఎస్సార్‌సీపీ హయాంలో మహర్దశ చేకూరింది. మనబడి నాడు–నేడు కింద పాఠశాల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. విద్యార్థులకు రోజూ రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తూ వచ్చారు. నిర్దేశించిన మెను ప్రకారం రోజుకో రకం వంటకాలను సిద్ధం చేసి విద్యార్థులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఈ రెండు నెలల వ్యవధిలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చంద్రబాబు సర్కార్ చొరవ చూపకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తాగేందుకు గుక్కెడు నీరు కరువే

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత జగనరాజుపల్లి మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజన ఏజెన్సీను మార్చారు. కొత్తగా వచ్చిన వారు మెనూ ప్రకారం కాకుండా వారికి నచ్చిన విధంగా వంట చేసి పెడుతున్నారు. అది కాస్త నాణ్యంగా లేక పోవడంతో సగానికి పైగా విద్యార్థులు ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకుంటున్నారు. మిగిలిన విద్యార్థులు


బోరు వద్ద నీళ్లు పట్టుకుని తాగుతున్న దృశ్యం

సైతం రుచి లేని వంటకాలను తినలేక పడేస్తున్నారు. అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఆఖరుకు తాగునీరు సైతం అందుబాటులో లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బోరుబావి నీరు తాగడంతో చాలా మంది విద్యార్థులు దగ్గు, జలుబు, జ్వరాలతో సతమతమవుతున్నారు. మధ్యాహ్న భోజనాన్ని సైతం చెట్టు కింద చేస్తుండడంతో వంటకాల్లో చింతాకు, పుల్లలు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. కాగా, పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ప్రిన్సిపాల్ రమేష్‌బాబు మాట్లాడుతూ.. తాగునీరు అందించేందుకు ప్రత్యేకంగా వాటర్ ప్లాంట్ లేదన్నారు. సత్యసాయి తాగునీటి పథకం నీటిని ఇప్పటి వరకూ అందజేసేవారమన్నారు. ప్రస్తుతం తాగునీటి పథకం కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో నీరు అందక ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమేనని అంగీకరించారు.

ప్రమాదంలో వివాహిత మృతి


మృతురాలు జయంతి

పెనుకొండ: స్థానిక పులేకమ్మ ఎత్తు వద్ద 44వ జాతీయ రహదారిపై కారు బోల్తా పడిన ఘటనలో వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... హైదరాబాద్‌కు చెందిన వెంకటేష్, జయంతి (67) దంపతులు మంగళవారం మారుతీ కారులో బెంగళూరుకు బయలుదేరారు. సాయంత్రం పులేకమ్మ ఎత్తు సమీపంలోకి చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన జయంతిని 108 అంబులెన్స్ ద్వారా పెనుకొండలోని సీహెచ్‌సీకి తరలించారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం: దీనదయాల్ స్పర్శ యోజన పథకం కింద స్కాలర్‌షిప్‌లకు దరకాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు హిందూపురం డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయకుమార్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 6 నుంచి 9వ తరగతి లోపు విద్యార్థులకు రెండు విభాగాల్లో పోటీ పరీక్ష నిర్వహించి ప్రతిభ చాటుకున్న వారికి రూ.6వేలు చొప్పున స్కాలర్‌షిప్పులను అందజేస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న వారు వ్యక్తిగతంగా కానీ, స్కూల్ ప్రిన్సిపాల్ ద్వారానైనా రూ.200 డిపాజిట్ చెల్లించి హిందూపురం డివిజనల్ ఆఫీసు లేదా ధర్మవరం హెడ్‌పోస్టాఫీసులో తెరిచిన ఖాతా నకళ్లతో అప్లికేషన్లు జత పరిచి 'పోస్ట్‌మాస్టర్ జనరల్, కర్నూలు రీజియన్, కర్నూలు – 518002' చిరునామాకు చేరేలా సెప్టెంబర్ 16వ తేదీలోపు పంపాలన్నారు. ఇతర వివరాలకు హిందూపురం, ధర్మవరంలోని హెడ్ పోస్టాఫీస్‌ల్లో సంప్రదించాలని కోరారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం అర్బన్: స్థానిక పార్థసారథి నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు చాకలి శ్రీనివాసులు(33) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ అంశానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న చాకలి శ్రీనివాసులుకు భార్య అపర్ణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యులు ఊరికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న శ్రీనివాసులు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా, శ్రీనివాసులు ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

యూపీఎస్‌తో 11,700 మంది ఉద్యోగులకు లబ్ధి

- డీఆర్‌ఎం విజయ్‌కుమార్

గుంతకల్లు: ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యునిఫైడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్) ద్వారా గుంతకల్లు డివిజన్‌లోని దాదాపు 11,700 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని డీఆర్‌ఎం విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక తన కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్, సీనియర్ డీఈఎన్ కో–ర్డినేషన్ రామిరెడ్డి, డీపీఓ నిర్మలాఆరోరాతో కలసి ఆయన మాట్లాడారు. యూపీఎస్ ప్రయోజనాలను వివరించారు. కాగా, ఎన్‌పీఎస్, యూపీఎస్‌లో చేరే అవకాశం ఉద్యోగుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు.

టీడీపీ నేతలపై కేసు నమోదు

గుడిబండ: తిమ్మలాపురం గ్రామానికి చెందిన కుంచిటి వక్కలిగ సంఘం డైరెక్టర్ కరుణాకర్‌పై దాడి చేసిన ఐదుగురు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మునిప్రతాప్ మంగళవారం తెలిపారు. సోషల్ మీడియాలో మాజీ ఎమ్మెల్సీ గుండుల తిప్పేస్వామికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టాడంటూ టీడీపీకి చెందిన పలువురు కరుణాకర్‌పై శుక్రవారం దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిని ఖండిస్తూ కుంచిటిగ సంఘం అధ్యక్షుడు బి.అంతరాజు, సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

పాముకాటుతో వివాహిత మృతి


పుష్ప (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసంపల్లికి చెందిన వివాహిత పాముకాటుతో మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన మేరకు... బసంపల్లికి చెందిన పుష్ప(27), హరికుమార్ దంపతులకు సంతానం లేదు. కూలి పనులతో జీవనం సాగించేవారు. సోమవారం ఓ రైతు తోటలో పనిలో నిమగ్నమైన పుష్పను పాము కాటు వేసింది. విషయాన్ని తోటి కూలీల ద్వారా తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే ఆమెను పుట్టపర్తిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక మంగళవారం ఆమె మృతి చెందింది.

ఇసుక రీచ్ పరిశీలన

ముదిగుబ్బ: మండలంలోని బూదనంపల్లి వద్ద ఉన్న ఇసుక రీచ్‌ను మంగళవారం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ విధుల్లో ఉండాల్సిన రెవెన్యూ ఉద్యోగి సాయిప్రకాష్ అందుబాటులో లేకపోవడంతో ఆయనకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీపంలోని రెవెన్యూ అధికారికి బాధ్యతలు అప్పగించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: పట్టణ పరిసర ప్రాంతాల్లో ఇళ్లకు ఏర్పాటు చేసుకున్న మోటార్లను అపహరించుకెళ్లిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ సునీత తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆమె వెల్లడించారు. నల్లమాడకు చెందిన కుంచపు గురుమూర్తి ఎలక్ట్రీషియన్ పనితో జీవనం సాగించేవాడు. సులువుగా డబ్బు సంపాదించాలనుకుని పుట్టపర్తి పరిసరాల్లో ఇళ్లకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను అపహరించుకెళ్లి, తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. ఈ క్రమంలో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం ఉదయం ప్రశాంతి పెట్రోల్ బంక్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన గురుమూర్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో విద్యుత్ మోటార్ల అపహరణ అంశం వెలుగు చూసింది. మొత్తం 19 మోటార్లకు గాను రూ.94 వేలు విలువ చేసే 16 మోటార్లను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు.

'కేఎస్ఎన్'లో మెగా జాబ్‌మేళా


ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ శంకరయ్య

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. దాదాపు 15 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. మౌఖిక పరీక్షల్లో 681 మంది వివిధ ఉద్యోగాలకు అర్హత సాధించారు. షై కన్సల్టెన్సీ సర్వీసు, ఫ్లిప్‌కార్ట్, ఫాక్స్ కాన్, హెటిరో, మేడ్ కోడ్, రిలయన్స్ సర్వీస్, పేటీఎం, విప్రో, టాటా ఎలక్ట్రానిక్స్, ఎన్సోర్స్, తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువతీయువకులు 951 మంది హాజరయ్యారు, ఆయా ఉద్యోగాలకు అర్హత పొందిన వారికి నియామక పత్రాల్ని కళాశాల ప్రిన్సిపాల్ పి. శంకరయ్య చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, జేకేసీ ప్లేస్‌మెంట్ సెల్, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్, బి.అనురాధ. జేకేసీ మెంటర్స్ ఎ.అనూష, పి.సింధూరి, రమణనాయుడు, రామాంజనేయులు, జేఎస్ పర్వీన్ పాల్గొన్నారు.

ఎస్‌ఐల బదిలీ

అనంతపురం సెంట్రల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 మంది ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మవరం నుంచి శ్రీనివాస్‌ను అనంతపురం వన్‌టౌన్‌కు, ఇక్కడ పనిచేస్తున్న రామకృష్ణను వీఆర్‌కు, పుట్టపర్తిలో వీఆర్‌లో ఉన్న సుధాకర్ యాదవ్‌ను అనంతపురం టూటౌన్‌కు, ఇక్కడ పనిచేస్తున్న రుషేంద్రబాబును వీఆర్‌కు, డీసీఆర్‌బీలో ఉన్న రామ్‌ప్రసాద్‌ను అనంతపురం ఫోర్త్ టౌన్‌కు, ఇక్కడ ఉన్న నాగమధును కణేకల్లుకు, అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులను వీఆర్‌కు, పీటీసీలో ఉన్న రాంబాబును అనంతపురం రూరల్‌కు, పుట్టపర్తి వీఆర్‌లో ఉన్న విజయ్‌కుమార్‌ను ఇటుకలపల్లికి, గుత్తిలో పనిచేస్తున్న నబీరసూల్‌ను బొమ్మనహాళ్‌కు బదిలీ చేశారు.

నెలాఖరున అనంత పశుశాఖ జేడీ ఉద్యోగ విరమణ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం సర్వీసు పూర్తి కావడంతో ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ మేరకు ఆ శాఖ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ క్రమంలో ఈ నెల 30న సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి గౌరవంగా వీడ్కోలు పలికేందుకు ఉద్యోగులు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే జేడీ కార్యాలయంలో పనిచేస్తున్న ఏడీ డాక్టర్ నాగార్జునరెడ్డి కూడా స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు ప్రభుత్వం అనుమతించడంతో ఆయన కూడా అదే రోజు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో పశుసంవర్ధకశాఖకు నూతన జేడీగా ప్రస్తుతం పెనుకొండ షీప్‌ఫారంలో డీడీగా పనిచేస్తున్న డాక్టర్ వెంకటస్వామిని పదోన్నతిపై ఇక్కడకు బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కొనసాగిన తాగునీటి పథకం కార్మికుల నిరసన


బత్తలపల్లిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

బత్తలపల్లి/తాడిమర్రి/పుట్టపర్తి టౌన్: జీతాలు తదితర డిమాండ్ల సాధన కోసం సత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమాలు మంగళవారం ఆరో రోజూ కొనసాగాయి. వేప ఆకులను తింటూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని వివిధ గ్రామాల ప్రజలకు దాదాపు 28 సంవత్సరాలుగా తాగునీటిని అందిస్తున్న 500 మందికి పైగా కార్మికులు ఆరు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి డిమాండ్ల సాధనకు తాగునీటి సరఫరాను నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి సత్యసాయి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని, ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఐఎఫ్‌టీయూ కోశాధికారి జగన్ మారుతి, బాషా, ఓబులేసు, శంకరయ్య, అనంతయ్య, జయరాము, కేశవ, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడిమర్రి చేపట్టిన కార్యక్రమంలో కార్యక్రమంలో కె.పెద్దఓబులేసు, పి.తిరుపాలు, కె.చిన్నఓబులేసు, బి.నాగార్జున, జి.రాములప్ప తదితరులు పాల్గొన్నారు.

అలాగే కొత్తచెరువులోని సత్యసాయి వాటర్ పంప్ హౌస్ వద్ద చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో పలువురు కార్మికులు మాట్లాడుతూ.. ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోతే ఏమి తిని బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చేతిలో చిల్లిగవ్వలేక ఇబ్బంది పడుతున్నామని వెంటనే బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్


మాట్లాడుతున్న వి.రాంభూపాల్

పెనుకొండ: నాసిన్, బెల్ పరిశ్రమల ఏర్పాటులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. భూనిర్వాసితులకు న్యాయం చేయాలంటూ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రాంభూపాల్ మాట్లాడుతూ.. ఇప్పటికే నిర్మించిన నాసిన్, నిర్మించబోయే బెల్ పరిశ్రమల కోసం పాలసముద్రం, చినబాబయ్యపల్లి, కావేటి నాగేపల్లి గ్రామాలకు చెందిన రైతుల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. అయితే పరిహారం చెల్లింపులో న్యాయం చేయడం లేదని మండిపడ్డారు. రైతులు ఎన్నో ఏళ్ళుగా ఇబ్బంది పడుతున్నా పట్టించుకోడం లేదన్నారు. ఇప్పటి వరకూ పునరావాసం కోసం అధికారుల చుట్టూ తిరిగి 12 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. భూములు కోల్పోయిన వారిలో అధిక భాగం దళితులు, బీసీలు, ఇతర వెనుకబడిన కుటుంబాల వారు ఉన్నారన్నారు. బెల్, నాసిన్ పరిశ్రమల్లో ఉద్యోగ నియామకాలు చేపడితే నిర్వాసిత రైతుల గురించి ఏ మాత్రం ఆలోచించక పోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రైతులకు పరిహారం చెల్లించాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, నాయకులు పెద్దన్న, హరి, ప్రవీణ్, గంగాధర్, నారాయణ, అంజనేయులు, కొండా వెంకటేష్, బాబావలి, వెంకటరాముడు, తిప్పన్న, గంగమ్మ, నారాయణ, అచ్చమ్మ, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ నిర్లక్ష్యమే మిస్బా ప్రాణాలు బలిగొంది!

- యర్రగుంట పీహెచ్‌సీ ఎదుట బాధిత తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన


ఆందోళనకారులకు నచ్చజెబుతున్న పోలీసులు

కణేకల్లు: యర్రగుంట పీహెచ్‌సీ డాక్టర్ విజయ్‌కుమార్ నిర్లక్ష్యం వల్లనే తమ బిడ్డ చనిపోయిందని మిస్బాకౌసర్ (9) తల్లిదండ్రులు షాబిరా, పీరావలి ఆరోపించారు. తీవ్ర జ్వరంతో చికిత్స కోసం రెండు దఫాలు ఆస్పత్రికొచ్చినా సరైన చికిత్స చేయకుండా రెఫర్ చేసి చేతులు దులుపేసుకోవడంతో అల్లారుముద్దుగా పెంచుకున్న మిస్బాకౌసర్‌ను కోల్పోవాల్సి వచ్చిందంటూ విలపించారు. డాక్టర్ విజయకుమార్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బాధిత కుటుంబసభ్యులు, బంధువులు మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు యర్రగుంట పీహెచ్‌సీని ముట్టడించారు. ఉదయం ఎంపీహెచ్‌ఈఓ తిరుపాల్‌నాయక్, పీహెచ్‌సీ ఏఎన్‌ఎం, సిబ్బంది... మిస్బాకౌసర్ ఇంటి పరిసరాల్లో క్రిమి సంహారక మందు పిచికారీ చేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో బాధిత కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న పాపే కనుమూసిన తర్వాత ఇలాంటి చర్యలు చేపడితే ఫలితమేమంటూ అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 2.45 గంటలకు మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది మళ్లీ ఇంటి వద్దకు చేరుకుని పరిసరాల్లో క్రిమి సంహారక మందు చల్లేందుకు సిద్ధమయ్యారు. అప్పటికే తీవ్ర వేదనతో ఉన్న కుటుంబసభ్యులు, బంధువులు ఒక్కసారిగా అధికారులపై మండిపడ్డారు. డాక్టర్ నిర్లక్ష్యం కారణంగా తమ కుమార్తె చనిపోయిందని మండిపడుతూ ఒక్కసారిగా ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. డాక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ శంకరరెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని నిరసన కారులకు నచ్చచెప్పి ఆందోళనను విరమింపజేశారు.